# ఎంచక్కా జైలు!

డా॥ రోహిణి చింతా

సీత 1953లో పుట్టింది. స్వతంత్ర్యం వచ్చిన ఆరేళ్ళకి. సీత అన్నయ్య లంతా తనకంటే చాలా పెద్దవాళ్ళు. అంటే స్వతంత్ర్యానికి ముందు పుట్టినవాళ్ళు, కొద్దో గొప్పో పోరాటం చూసిన వాళ్ళూనూ. సీతతో చిన్నప్పుడు వాళ్ళు ఆ స్వతంత్ర్య పోరాటం విషయాలు చెప్తుంటే, సీతకి చాలా బాధగా ఉండేది. తనూ పాల్గొనలేకపోయిందని. సీతా వాళ్ళమ్మ పోరాటంలో పాల్గొనడమే కాక, ఒకరోజంతా నిరాహారదీక్ష కూడా చేసిందట. వాళ్ళూరినుంచి రాజమండ్రి లాంచీలో వెళ్ళి మరీ చేసిందిట. ఊరు ఆడవాళ్లందర్నీ పోగేసీ, జెండా పట్టుకునీ... (సీతకి ఏ జెండానో అంతగా తెలీదు. వాళ్ళన్నయ్య సరిగ్గా చెప్పలా. తను మాత్రం వాళ్ళింట్లో తులసికోట ముందు త్రికోణాకారంలో ఉండే నారింజరంగు జండా అనుకుంటుండేది. తను ఆ జెండా చాలా బొమ్మల్లో చూసింది. కళావతి వాళ్ళ దేవుడి గూడు మీద కూడా అదే ఉంటుంది.)

సరే ! జండా పట్టుకుని, నూలు చీర కట్టుకుని.... ఊహూ ! ముంధు నూలు చీర కట్టుకుని, (జండా దొడ్లో ఉంటుంధి కదా.....!), తరవాత జెండా పట్టుకుని, చేనుగారి ఆవిడను, గుమ్మిడికాయ మామ్మని, కనకమ్మని..... ఇంకా ఎంతో మంది ఆడవాళ్ళని (వాళ్ళూరిలో చాలా మందున్నారులే), వాళ్ళందర్నీ తీసుకుని రాజమండ్రి వెళ్ళి అక్కడ కలెక్టరు కార్యాలయం ముందు, ఎండలో రోజంతా కూచుని 'స్వాతంత్ర్యం కావాలి' అనో, ఇంకేమనో (అబ్బా ! వాళ్ళన్నయ్యకి అసలు కథ చెప్పడమే రాదు ) అరిచి, అరచ్చి స్వతంత్ర్యం తెప్పించిందిట. అలా అరిచినందుకు వాళ్ళమ్మని జైల్లో కూడా పెట్టబోయార్ట. అంటే స్కూల్లో మాష్టారు, మనం అరిస్తే బల్లమీద నుంచోపెట్టరూ.... అలాగ. ఎటొచ్చీ వాళ్ళమ్మ రోడ్డుమీద అరచింది కదా... అందుకు జైలన్నమాట.

వాళ్ళమ్మ అంత గొడవచేసి జైలుకెళ్ళబోతే అందరూ తన్ని తిట్టి, బుద్ధి చెప్పకుండా, ఎంతో మెచ్చుకుని, ఇదిగో ఇప్పటిదాకా కథలు కథలుగా చెప్తున్నారు. కానీపాపం, మొన్నేమో సీత కళావతితో గవ్వలాడుతూ కొంచెం అరచి, కొంచెం కరిచీ,




కొంచెం జుట్టుపీకితే మాత్రం అందరూ తిట్టారు. నాన్నయితే గొడవపడితే కొడతానన్నారు కూడా. అమ్మపెద్దది కదా, పైగా అందరికీ వంటకూడా చేస్తుంది. అందుకే ఏమీ అనలేదు. మళ్ళీ నిరాహార దీక్ష చేసి, అరుస్తుందేమోనని. కానీ అన్నయ్యకి ఈ విషయం తెలీదు. అదేదో పెద్ద గొప్పలా "చూశావా ! అమ్మ ఎలా పోరాటం చేసిందో" అని కథ చెప్తాడు. రోజూ ఇదే కథ. సీతకి బోరు కొడుతోంది. ఈ కథ చెప్పినప్పుడల్లా అమ్మ అన్నయ్యకి ఒక లడ్డూ ఇస్తుంది. అసలందుకే అన్నయ్య కథ చెప్తున్నాడేమో ! సీతకి మాత్రం ఇదంతా ఏమీ నచ్చలా.

అమ్మకి, అన్నయ్యకి బుద్ధి చెప్పాలంటే, తనూ జైలుకెళ్ళేటంత గొప్ప పనేమైనా చెయ్యాలి. అప్పుడు తనకి రోజూ అదే కథ వినే బాధ తప్పుతుంది. అన్నయ్యేమో ఈ కొత్త కథ ఆచార్లుగారి పిల్లలకి చెప్పచ్చు. కాని, తనేమో చిన్నది కదా ! ఏం చేస్తే జైలుకి వెళ్తారో తెలీదు. స్వతంత్ర్యపోరాటం కాస్తా అయిపోయింది. సరే ! రేపు కళావతిని, చేనుగారి పద్మని అడిగితే తెలుస్తుంది. పద్మా వాళ్ళన్నయ్య పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు కదా, అతనికి అన్నీ తెలుసు. అతన్నడిగితే.... వద్దులే ! అతను అన్నయ్యతో చెప్పేస్తాడు. అప్పుడు అన్నయ్యే ముందు జైలుకి వెళ్తాడు. తనకి ఇంక అన్నయ్య కథ వినాల్సొస్తుంది. ఎందుకూ....! అంతకంటే ప్రకాశం మంచివాడు. పైగా మూడో క్లాసూ ! తనతో చెప్తే సరిపోతుంది.

ఘర్నాడు సీత పొద్దున్నే లేచి చెరువుగట్టుకి వెళ్తుంటే, ప్రకాశం వాళ్ళ అరుగుమీద కూర్చుని లెక్కలు చేసుకుంటున్నాడు. అతనూ ఎంత ఫాస్టుగా లెక్కలు చేస్తాడో. మాష్టార్లంతా అతనితోటే బోర్డుమీద చేయిస్తారు. అతనికి అన్నీ వచ్చు. సీత ప్రకాశం దగ్గరికెళ్ళి "ప్రకాశం, మరేమో ఏదైనా గొప్ప పని చేసి జైలుకెళ్ళిన వాళ్ళ కథలు చెప్పవా?" అని అడిగింది. ప్రకాశం పుస్తకం మూసి "అమ్మా ! సీతొచ్చిందే" అని కేక వేశాడు. సీతకి ఇప్పుడు ప్రకాశం వాళ్ళమ్మ స్వతంత్ర్య పోరాటం కథ వినాలేమోనని చాలా భయం వేసింది. కానీ పాపం, వాళ్ళమ్మేమో ఎంచక్కా పెద్ద పళ్ళెంలో గోరుమీటీలూ, జంతికలూ తెచ్చింది. సీత అవి తింటూంటే ప్రకాశం గాంధీగారి కథ చెప్పాడు. సీతకి ఎంతో నచ్చింది. కాని స్వతంత్ర్య పోరాటం అయిపోయింది కదా ! మరెలా ! అందుకని ప్రకాశంతో "ప్రకాశం, స్వతంత్ర్య పోరాటంలో తప్ప మరెవ్వరూ జైలుకి వెళ్ళలేదా ! ఇంకెవరూ గొప్పవాళ్ళు లేరా !" అనడిగింది. ప్రకాశం బాగా ఆలోచించి రేపు చెప్తానన్నాడు. ప్లేట్లో జంతికలు కూడా అయిపోయాయి. అందుకనీ సీత సరేనన్ని ఇంటికి వచ్చేసింది. మరి గొప్పపనులు చెయ్యాలంటే కొన్ని రోజులు ఆలోచించి చెయ్యాలి కదా ! అందుకని.

ఇంటికి వచ్చేసరికి అమ్మ భోజనం వడ్డిస్తోంది. నాన్న సీతని తొందరగా కాళ్ళూ, చేతులూ కడుక్కురమ్మన్నాడు, భోజనం ముందు పెత్తనానికి వెళ్ళిందని విసుక్కుంటూ. సీతకి జంతికలూ,

గోర్మిటీలూ కడుపునిండా ఉన్నాయి. భోజనం మానేద్దామనుకుంది. కాని, మరి జైలుకెళ్తే రాళ్ళు కొట్టడానికి బలముండాలి కదా అని ఆలోచించి మళ్ళీ తినడానికి వచ్చింది. పళ్ళెంలో అన్నం ఊరికే కెలుకుతూంటే, నాన్న "ఇలా కంచం నుంచి లేస్తావు. మళ్ళీ ఆకలంటూ మొదలెడతావు. ఆగు నేపెడతా" నంటూ మొత్తం తినిపించాడు. సీతకి భుక్తాయాసంతో తెగ నిద్దర వచ్చేసింది.

ప్రకాశం రెండురోజులు దాకా కథ చెప్పనేలేదు. అసలు తనకి కథలు వచ్చా, రావా అని సీతకి అనుమానం వచ్చింది. అప్పుడు చెప్పాడు ప్రకాశం 'రాబిన్‌హుడ్ కథ'. సీతకి ఎంతో నచ్చింది. రాబిన్‌హుడ్ ఒక పెద్ద గొప్ప దొంగ. స్వతంత్ర్య పోరాటం చెయ్యకుండానే జైలుకూడా వెళ్ళాడు. (ఏమో ! వెళ్ళాడో లేదో తను మర్చిపోయింది.) రాబిన్ హుడ్‌లా డబ్బున్న వాళ్ళ నుంచి ఏదైనా దొంగిలించి, పేదవాళ్ళకిస్తే, పేరుకి పేరూ... జైలుకి జైలూనూ ! అప్పుడు ఎంచక్కా అన్నయ్య తన కథే చెప్తాడు. అమ్మ తనకే లడ్డూ పెడుతుంది.

సీత ఆ రాత్రంతా ఊళ్ళో అందరికంటే డబ్బున్న వాళ్ళెవరా అని బాగా ఆలోచించింది. చాలామందికంటె సీతవాళ్ళకే ఎక్కువ పొలం ఉంది. కానీ వాళ్ళ పొలంలో కాయలు కోస్తే నాన్న తిట్టి ఊరుకుంటాడు కానీ.. జైల్లో పెట్టించడు. వాళ్ళకంటే ఎక్కువ పొలం, పక్కవీధిలో సుబ్బరాజు గారికి ఉంది... పెద్ద కొబ్బరితోటా, ఇంకా పెద్ద మామిడి తోటానూ. ఆయన తోటలో దొంగతనం చేస్తే ఎంచక్కా జైలుకి వెళ్ళచ్చు. కానీ కొబ్బరికాయలు మొయ్యలేదు. మామిడికాయలయితే బోల్డు దొంగి లించచ్చు, బోల్డు బీదవాళ్ళకి ఇవ్వచ్చు. కానీ వాళ్ళూరిలో బీదవాళ్ళెవరూ... పోనీ, వాళ్ళ పొలం రైతు గోపాలంగార్కి ఇస్తేనో ! ఊహూ ! బీదవాళ్ళకి కదా ఇవ్వాలి. పోనీ వాళ్ళ మాష్టారుకిస్తే... ఎంచక్కా బోల్డు మార్కులు వేస్తారు. కానీ ఆయన కూడా బీదవాడు కాదే ! బాగా బీదవాళ్ళెవరూ... వాళ్ళింట్లో అద్దెకుంటున్నవారు బీదవాళ్ళే.. కాని దర్జా బీదవాళ్ళు. ఆయన రోజూ రిక్షాల్లో ముప్టికి వెళ్తారు. వాళ్ళావిడ రోజూ 'నారాయుడి' కొట్లో ఇడ్లీ కూడా తింటుంది. వాళ్ళు అసలైన బీదవాళ్ళు కాదేమో ! మరి గుర్రబ్బండ బ్బాయో.. ఊహూ !. అబ్బా ! వాళ్ళూళ్ళో బీదవాళ్ళే లేరేమో ! అప్పుడెలా !

పోనీ ఎవ్వరూ లేకపోతే స్కూలు ముందుండే మూర్ఛమొష్టాళ్ళకిస్తే సరి ! కానీ వాళ్ళంటే తనకి చాలా భయం. వాళ్ళు పిల్లల్నెత్తుకుపోయి, కళ్ళూ కాళ్ళూ తీసేసి అమ్మేస్తారు. మరి ఎలా ఇవ్వడం. వాళ్ళు చూస్తూండగా స్కూలు బెంచిమీద పెట్టి పారిపోతే వాళ్ళే తీసుకుంటారు. అప్పుడు సుబ్బరాజు గారి బంట్రోతులు సీతని తీసుకెళ్ళి పోలీసులకి అప్పగిస్తారు.

మర్నాడు సీత కళావతితో ఈ విషయం చెప్పింది. కళావతి, వాళ్ళమ్మ కొడుతుందని రానంది. ఒట్టిపిరికి మొద్దు. సీత ఒక్కత్తే వెళ్ళింది.... బడి మధ్యాహ్నం బెల్లు కొట్టాక, ఇంటికి భోజనానికి వెళ్ళకుండా తోటలో దొంగతనానికి.

పొలం చాలాదూరం. కష్టపడి కాలవదాటి మరీ వెళ్ళింది. ఒకటే మట్టి, రోకలిబండలూనూ. భయం వేసింది. కానీ మరి వెళ్ళాలి కదా.....! పొలంలో ఎవ్వరూ లేరు. భోం చెయ్యడానికి వెళ్ళారేమో. మరి ఎవరూ చూడకపోతే జైలుకెలా వెళ్ళడం. అందుకని, ఎవరైనా వచ్చాక దొంగతనం చేద్దామని, కాస్సేపు చెట్టుకింద కూర్చుని ఎదురు చూస్తూ గడిపింది సీత. కాసేపటికి సుబ్బరాజుగారి బంట్రోతులు వస్తుంటే సీత మామిడికాయల్ని రాళ్ళిచ్చుకుని కొట్టింది. కిందున్న పిందెల్ని ఏరి మళ్ళీ పారేసి మళ్ళీ ఏరింది... వాళ్ళు చూసేదాకా. బంట్రోతులు గబగబా వచ్చి రాళ్ళు లాక్కుని సీతని పట్టుకున్నారు. సీత బాగా గింజుకుని వాళ్ళ కాళ్ళు తొక్కి, చేతులు కొరికేసింది.... బాగా అల్లరి చేస్తే తొందరగా పోలీసులొస్తారనీ ! కానీ బంట్రోతులు పోలీసుల్ని పిలవలేదు. సీతని చెట్టుకు కట్టేశారు. సీతకి ఇప్పుడు నిజంగా భయం వేసింది. వాళ్ళ చేతుల్లో పెద్ద కర్రలు కూడా ఉన్నాయి. తాళ్ళు గుచ్చు కుంటున్నాయి. సీతకి చాలా ఏడుపు వచ్చేసింది. పాపం చిన్నది కదా ! గట్టిగా ఏడవడం మొదలు పెట్టింది. పెద్ద పెద్దకన్నీళ్ళు కారడం మొదలెట్టాయి. "నన్ను పోలీసులకి ఇవ్వద్దూ... మా ఇంటికి పంపిం చెయ్యండి, జైలుకి వద్దూ" అంటూ అరవడం మొదలు పెట్టింది. కాస్సేపటికి జనం పోగయ్యారు. సుబ్బరాజు గారు కూడా వచ్చారు. సీత తాళ్ళు ఇప్పి "మరింకెప్పు డన్నా ఇలా చేస్తావా?" అని అడిగారు. సీత ఏమి మాట్లాడకుండా తల అడ్డంగా ఊపింది. పాపం గుండె గట్టిగా కొట్టుకుంటోంది. సుబ్బరాజు గారు నవ్వేసి, వాళ్ళ బంట్రోతుల్తో "పట్టాభి మాష్టారింట్లో దింపెయ్యండిరా" అని చెప్పి, సీతకి ఓ పది మంచి మామిడికాయలు కోసి ఇచ్చారు. బంట్రోతులు సీతను ఎత్తుకుని తీసుకొచ్చి ఇంట్లో దింపారు. సీత గబగబా ఇంట్లోకి పారిపోయింది.

అన్నయ్యకి ఎవరో ఈ విషయం చెప్పారు. ఇంటికొచ్చి అన్నయ్య అమ్మతో ఈ కథ చెప్పి పగలబడి నవ్వాడు. కొన్నాళ్ళు ఇంటికెవరొచ్చినా ఇదే కథ అన్నయ్య చెప్పడం, అందరూ సీతని ముద్దాడడం. సీతకి ఎంతో నచ్చింది. ఆఖరుకు తన కథ కూడా అన్నయ్య అందరికీ చెప్పాడు. అమ్మ లడ్డూలన్నీ తనకే పెట్టింది.

## కాలం

గడియారం టిక్ టిక్‌మని
చప్పుడు చేస్తున్నది
ఎంత నిశ్శబ్దంలోనూ
ఎంతటి మహాధ్వనిలోనూ
దానిని గమనించకపోవడం
సాధ్యమయ్యే పనికాదు

ఆ చప్పుడు కాలం కొంచెం కొంచెం
కారిపోతున్న చప్పుడు
కాలిపోతున్న చప్పుడు
జీవితం ఖర్చయిపోతున్న చప్పుడు
విశ్వాంతరాళం గుండె కొట్టు
కుంటున్న చప్పుడు

ఆ చప్పుడు ఆగదు
ఆగకూడదు
ఒక మహా ప్రయాణం, అఖండ
జీవరాశి గమనం
కాలం విశ్వం

– డా॥ మానేపల్లి